క్లుప్తంగా

ఘనంగా వృద్ధుల దినోత్సవం



ఆరోగ్య భద్రతపై వృద్ధులకు అవగాహన కల్పిస్తున్న వైద్యాధికారులు

కార్వేటినగరం: అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని స్థానిక సామాజిక కమ్యూనిటీ హెల్త్ సెంటర్‌లో మంగళవారం ఘనంగా జరుపుకున్నారు. ఈ సందర్భంగా వైద్యాధికారి డాక్టర్ గోపీనాథ్ మాట్లాడుతూ వృద్ధులు ఆరోగ్యం పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు. నెలకు ఒకసారి స్థానిక ఆరోగ్య కేంద్రంలో వైద్య పరీక్షలు చేసుకుని వైద్య నిపుణుల సలహాల పాటించాల్సిన అవసరం ఎంతైనా ఉందని తెలిపారు. అలాగే అనంతరం అంతర్జాతీయ వృద్ధుల దినోత్సవాన్ని పురస్కరించుకుని 80 ఏళ్లు నిండిన వారిని ఘనంగా సన్మానించారు. అలాగే బీపీ, షుగర్, కంటి శుక్లాలు, క్యాన్సర్, ఎముకల అరుగుదల, గుండె జబ్బులు, కిడ్నీ సమస్యలు, స్త్రీ సంబంధ సమస్యలు ఎన్‌సీడీ వంటి వాటిపై క్షుణ్ణంగా అవగాహన కల్పించి ఉచితంగా మందులు పంపిణీ చేయడం జరిగింది. కార్యక్రమంలో వైద్యాధికారులు డాక్టర్ కీర్తి, డాక్టర్ శ్రుతిభాగ్యం, డాక్టర్ శ్రుతి, డాక్టర్ యూసఫ్, పలువురు వృద్ధులు పాల్గొన్నారు.

మెనూ ప్రకారం భోజనం పెట్టాలి



మధ్యాహ్న భోజనాన్ని రుచి చూస్తున్న ఎంపీడీఓ విద్యావతి

పాలసముద్రం : మండల పరిధిలోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మధ్యాహ్న భోజనం మెనూ ప్రకారం పెట్టాలని ఎంపీడీఓ విద్యావతి, ఎంఈఓ రాజేంద్రప్రసాద్ తెలిపారు. మంగళవారం పాలసముద్రం ప్రభుత్వం ఉన్నత పాఠశాలల్లో మధ్యాహ్న భోజనాన్ని వారు పరిశీలించారు. ఎంపీడీఓ విద్యావతి మాట్లాడుతూ విద్యార్థులకు మెనూ ప్రకారం పప్పు, కూరగాయలుతో వండిన ఆహారం, గుడ్డు ప్రతి రోజూ సక్రమంగా అందించాలన్నారు. బియ్యాన్ని మంచి నీటితో కడిగిన తరువాతే అన్నం చేయాలన్నారు. రసం, సాంబారు తయారీకి తాజా కూరగాయలు, అయోడిన్ ఉప్పు వాడాలని సూచించారు. అనంతరం విద్యార్థుల కోసం తయారు చేసిన మధ్యాహ్న భోజనాన్ని రుచి చూశారు. కార్యక్రమంలో హెచ్‌ఎం మీనాక్షి పాల్గొన్నారు.

ఫొటో ఫోజులకే 'పొలం పిలుస్తోంది'



తూతూమంత్రంగా సమావేశం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

కార్వేటినగరం: ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ×పొలం పిలుస్తోంది¤ కార్యక్రమాన్ని నిర్వహించాలని చెబుతుంటే క్షేత్రస్థాయిలో అధికారులు మాత్రం పొలాల్లోకి వెళ్లి ఫొటోలకు ఫోజులు ఇచ్చి వెళ్లిపోతున్నారని గ్రామాల్లో రైతులు విమర్శలు గుప్పిస్తున్నారు. మంగళవారం మండల పరిధిలోని గోపిశెట్టిపల్లి, ఈదువారిపల్లి, నాగిరెడ్డిపల్లిలో వ్యవసాయ శాఖ అధికారులు ×పొలం పిలుస్తోంది¤ కార్యక్రమం నిర్వహించారు. అయితే పైస్థాయి అధికారుల ఒత్తిడి మేరకు రైతులకు పంటల సాగుపై మెలకువలు, సలహాలు, సందేశాలు వివరించకుండా పొలాల్లోకి వెళ్లి బ్యానర్ పట్టారా.. ఫొటోకు ఫోజు ఇచ్చారా.. అయిపోయింది అని వెళ్లిపోయినట్లు సమాచారం. కనీసం పంటలకు సోకే రోగాలకు ఏ మందులు వాడాలో కూడా అవగాహన కల్పించలేదని, రైతుల సమావేశం అంటూ రైతులకు ఉన్న విలువైన సమయాన్ని వృథా చేస్తున్నారని విమర్శలు గుప్పిస్తున్నారు.

ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకోవాలి



పుస్తక బహుమతి అందుకుంటున్న విద్యార్థిని


పుత్తూరు: విద్యార్థులు ఉన్నత లక్ష్యాలను నిర్దేశించుకొని ఆ దిశగా కృషి చేయాలని పిళ్లారిపట్టు ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపల్ ఎస్వీకుమార్ సూచించారు. మంగళవారం కళాశాలలో స్వర్ణాంధ్ర-2047 కార్యక్రమంలో భాగంగా విద్యార్థులకు వ్యాసరచన, ఉపన్యాస పోటీలు నిర్వహించారు. ప్రిన్సిపల్ మాట్లాడుతూ 2047 విజన్ పేరిట రాష్ట్రం పారిశ్రామికీకరణ, వ్యవసాయం, విద్య, ఆరోగ్యం రంగాల్లో అత్యుత్తమ స్థాయిలో రాణించేందుకు ప్రణాళికలు రూపొందిస్తున్నట్టు తెలిపారు. పోటీలో ప్రతిభ చూపిన విద్యార్థులు చేతన, కిరణ్‌సైని, చంద్రప్రసాద్‌లకు పుస్తకాలను బహుమతిగా అందజేశారు. కార్యక్రమంలో ఏఓ హనుమంతరావు, అధ్యాపకులు కిషోర్, వేలాయుధం ఆచారి, రామకృష్ణ, సుగుణ, హరీష్ తదితరులు పాల్గొన్నారు.

ఇది మల్లెల వేళయనీ...

పూజల్లో మల్లెపూలు విరివిగా వాడుతారు. అందరికీ ఇష్టమైన సువాసనభరిత పువ్వులు మల్లెలు. వీటి నుంచి తైలం కూడా తయారు చేస్తారు. రోజురోజుకూ మల్లెల ధర పెరుగుతోంది. రైతుకు కూడా లాభాలు అందిస్తోంది. మంచి దిగుబడి, ధరలు దక్కాలంటే మల్లెను ఇప్పటి నుంచే సాగు చేయడం మేలు. ఇప్పుడు నాటుకుంటే మాఘమాసం, వేసవిలో పూలు విరబూస్తాయి. పెళ్లిళ్లు, శుభ కార్యాలు కూడా ఆ సమయంలో మెండుగా ఉంటాయి. పూలకు మంచి గిరాకీ లభిస్తుంది. నియోజకవర్గంలో మల్లెపూలు వందల ఎకరాల్లో సాగవుతున్న నేపథ్యంలో రైతులు మల్లె సాగు చేయాల్సిన పద్ధతులు, చీడపీడల నివారణ చర్యలను తీసుకోవాలని వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ వివరించారు.

- మల్లెల సాగుకు అనువైన కాలం
- మెళకువలు పాటిస్తే అధిక లాభాలు





సీఎం కండ్రిగలో సాగులో ఉన్న మల్లె తోట (ఇన్‌సెట్) తోటలో పూసిన మల్లె మొగ్గ

పాలసముద్రం: నియోజకవర్గంలో ముఖ్యంగా విడిమల్లి, దొంతరమల్లె, గుండు మల్లె, బొండు మల్లె రకాలను రైతులు సాగు చేస్తున్నారు. మల్లెను తేలికపాటి నేలల్లో జూన్ నుంచి డిసెంబర్ వరకు ఎప్పుడైనా నాటుకోవచ్చు. పండే కాలం, డిమాండ్ దృష్ట్యా మల్లెను ప్రస్తుత కాలంలో నాటుకోవడమే ఉత్తమం. కొమ్మ కత్తిరింపు లేదా అంటు మొక్కల ద్వారా మల్లెను నాటుకోవచ్చు. పాలసముద్రం వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ సలహాలు పాటిస్తూ, చీడపీడలు, తెగుళ్లను నివారించుకుంటూ ముందు కెళితే మంచి లాభాలు పొందవచ్చు.

మల్లెను ఆశించే తెగుళ్లు

- **ఆకు ఎండు తెగులు:** ఈ తెగులు ఆశించిన ఆకులు దళసరిగా మారుతాయి. ఆకు పై భాగంలో ఎరువు మచ్చలు ఏర్పడుతాయి. తీవ్రదశలో 50 శాతం వరకు దిగుబడి తగ్గుతుంది.

నివారణ చర్యలు: మాంకోజెబ్ 3 గ్రాములు లేదా కార్బండిజమ్ 1 గ్రాము లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.

ఆశించు చీడపీడలు– నివారణ చర్యలు

- **మొగ్గ తొలుచు పురుగు లక్షణాలు:** ఈ పురుగు లార్వా పువ్వులోకి చొచ్చుకుపోయి పూల భాగాలను తినేస్తుంది. తీవ్ర దశలో మొగ్గలన్నింటినీ ఒక దగ్గరికి చేర్చి ముడుచుకుపోయేలా చేస్తుంది.

నివారణ: లార్వా ఆశించిన మల్లె మొగ్గలను ఏరివేసి నాశనం చేయాలి. రాత్రిపూట దీపపు పురుగులు పెట్టి, రెక్కల పురుగులను ఆకర్షింపచేసి నాశనం చేయాలి. మల్లె తోటను పరిశుభ్రంగా ఉంచుకోవాలి. సరైన పద్ధతిలో కొమ్మ కత్తిరింపులు చేయాలి. 5 శాతం వేపగింజ కషాయం లేదా మలాథియాన్ లేదా క్వినాల్‌ఫాస్ మందును లీటరు నీటికి 2 మి.లీ చొప్పున కలిపి పిచికారీ చేయాలి. లేదా ప్రొఫినోఫాస్ 2 మి.లీ సైపర్మోసాథ్ 0.5 మి.లీ లీటరు నీటిని కలిపి పిచికారీ చేయాలి.

- **మడ్డి ఈగ లక్షణాలు:** మల్లె మొగ్గ రక్షక పత్రాల మొదలు వద్ద మడ్డి ఈగ యోగట్ రంధ్రం చేసి మొగ్గలోకి ప్రవేశించి లోపలి భాగాలను తింటాయి. ఈ ఈగ ఆశించిన మొగ్గలు గులాబీ రంగులోకి మారతాయి.
- **నివారణ చర్య:** థయోమిథాక్సిన్ 0.75 గ్రాములు లేదా ఫ్లూఫెనోక్సురాన్ 1.5 గ్రాములు లేదా నోవాల్యురాన్ 3 గ్రాములు లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి.
- **ఆకుగూడు పురుగు లక్షణాలు:** ఈ పురుగు లార్వా మల్లె ఆకులను ఒకచోటకు చేర్చి గూడుకట్టి ఆకుల్లోని పత్ర హరితాన్ని గోకి తింటుంది. వర్షాకాలంలో మొక్క కింద భాగం ఆకులను ఆశించి తీవ్రంగా నష్టపరుస్తుంది. వేసవిలో మొక్కపై భాగంలో ఉండే ఆకులపై ఆశించి తీవ్రంగా నష్టపరుస్తుంది.

నివారణ: ఇమిడాక్లోప్రిడ్ 2 మి.లీ లేదా డైమిథోయేట్ 2మిల్లీ లీటర్లు లీటరు నీటికి కలిపి పిచికారీ చేస్తే మంచి ఫలితం ఉంటుంది.

- **నల్లి లక్షణాలు:** ఈ పురుగు ఉధృతి ముఖ్యంగా పొడి వాతావరణంలో ఎక్కువగా ఉంటుంది. పురుగులు ఆకు అడుగు భాగాన చేరి రసాన్ని పీల్చడంతో ఆకులు పసుపు రంగుకు మారి రాలిపోతాయి. పురుగు ఆశించిన ఆకులు, మొగ్గలు, లేతకొమ్మలపై బొడిపెలు వస్తాయి. ఫలితంగా మొక్కల గిడసబారి, మొక్క నుంచి మొగ్గల ఉత్పత్తి, సామర్థ్యం తగ్గుతుంది.

నివారణ: నల్లి ఆశించిన మొక్క భాగాలను పెరికి నాశనం చేయాలి. డైక్రోఫాల్ (18.5ఈసీ) 3మి.లీ లేదా నీటిలో కరిగే గంధకం 50 డబ్ల్యూపీ(5గ్రా.లీ)ను పిచికారీ చేయాలి.



పూల మొగ్గలను తీస్తున్న కూలీలు

మెళకువలు పాటించాలి



ఢిల్లీప్రసాద్, వ్యవసాయాధికారి

అంటు మొక్కలు నాటుకోవాలనుకున్నప్పుడు మొక్కకు మొక్కకు మధ్య 25 మీటర్ల వెడల్పు. 200 మీటర్ల పొడవు ఉండేలా చూసుకోవాలి. మల్లె లేత చిగుర్ల నుంచి పూలు వస్తాయి. కాబట్టి ప్రతి ఏడాది డిసెంబర్–జనవరి మాసాల్లో మొక్కల ఆకులను మనమే రాల్చాలి. కొమ్మలను కత్తిరించాలి. కొమ్మల కత్తిరింపునకు 10 నుంచి 15 రోజుల ముందు నీరు పెట్టడం ఆపేయాలి. కత్తిరింపుల తరువాత నీటి తడులు ఇస్తే మొక్కలు కొత్తగా చిగురిస్తాయి. అవసరాన్ని బట్టి 8 నుంచి 10 రోజులకు ఒకసారి తడి ఇవ్వాలి. ప్రతి మొక్కకు 8 నుంచి 10 కిలోల పశువుల ఎరువు అందించాలి. 60 నుంచి 20 గ్రాముల నత్రజని, 1120 గ్రాముల భాస్వరం, పొటాష్ ఎరువులను మొదటి కొమ్మ కత్తిరింపు చేసిన వెంటనే వేయాలి. పూల దిగుబడి పెంచేందుకు లీటరు నీటికి 2.5 గ్రాముల జింక్‌సల్ఫేట్, 5గ్రాముల మెగ్నీషియం సల్ఫేట్ సూక్ష్మధాతువులను కలిపి రెండు లేదా మూడు దఫాలుగా పిచికారీ చేయాలి.

శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకోండి



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న ఎంఈఓలు

శ్రీరంగరాజపురం: విద్యార్థులు శాస్త్రీయ విజ్ఞానం పెంపొందించుకోవాలని ఎంఈఓ అరుణాచలంరెడ్డి అన్నారు. మండలకేంద్రంలో మండల స్థాయిలో చెకుముకి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో 49 కొత్తపల్లిమిట్ట జిల్లాపరిషత్ పాఠశాలకు చెందిన విద్యార్థులు నవ్యశ్రీ, జ్యోతీశ్వర్, దీక్షిత, యామిని, ప్రేమ్ కుమార్, సంతోష్‌రాజ్ విజేతలుగా నిలిచారు. వారికి అవార్డులు, బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 సబర్మతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విజయపురంలో...



సర్టిఫికెట్లు అందుకున్న విద్యార్థులతో ఉపాధ్యాయులు

విజయపురం: మండల స్థాయి చెకుముకి సైన్స్ టాలెంట్ టెస్ట్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయిని శ్యామల ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. ఈ పోటీల్లో జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విజయపురం ప్రథమ స్థానం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల గంగమాంబపురం ద్వితీయ స్థానం, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల జంబాడ తృతీయ స్థానం కైవసం చేసుకున్నాయి. ప్రతిభ చూపిన విద్యార్థులకు సర్టిఫికెట్లు, బహుమతులు అందజేశారు.

మద్యం దుకాణాలు బంద్



మూతబడిన మద్యం దుకాణాలు

నగరి: ఉద్యోగ భద్రత కల్పించాలంటూ వైన్ షాపు సిబ్బంది నిరసనలకు దిగడంతో ప్రభుత్వ మద్యం దుకాణాలు మూతబడ్డాయి. ప్రభుత్వం ప్రైవేటు మద్యం పాలసీకి గ్రీన్ సిగ్నల్ ఇచ్చిన నేపథ్యంలో తమ భవిష్యత్తు ఏమిటని వైన్‌షాపు సిబ్బంది ప్రశ్నిస్తున్నారు. వారు చేసిన అభ్యర్థనలకు మూడు రోజుల్లో అనుకూలమైన ప్రకటనలు వెలువరిస్తామని అధికారులు చెప్పినా అలాంటి ప్రకటనలు ఏమీ రాలేదు. డీఎం కార్యాలయం, ఎండీ కార్యాలయం, ఎక్సైజ్ మంత్రి, ఐటీ మంత్రి, డిప్యూటీ సీఎం, సీఎం అంటూ అందరికీ వినతి పత్రాలు సమర్పించినా ఉద్యోగ భద్రత విషయంలో ఎలాంటి చర్యలు తీసుకోలేదు. ఇంతలో అగ్రిమెంటు కాలం కూడా ముగియడం, ఆ అగ్రిమెంటును రెన్యువల్ చెయ్యడానికి కూడా దిక్కు లేకపోవడంతో వైన్‌షాపు సిబ్బంది తమకు న్యాయం చేయాలంటూ నిరసనలకు దిగారు. మద్యం షాపులను మూసివేశారు. మూసిన దుకాణాల వద్దే ఉంటూ తమ వద్దకు ఎవరైనా ఎక్సైజ్ అధికారులు వస్తే వారికి బాధ్యతలు అప్పగించి వెళ్లిపోతామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. 2019లో గత ప్రభుత్వం ప్రభుత్వ మద్యం దుకాణాల ఏర్పాటులో భాగంగా వీరికి ఉద్యోగాలు కల్పించింది. నియోజకవర్గ పరిధిలో 25 మద్యం దుకాణాలు ఉండగా 70 మంది పనిచేస్తున్నారు. 2019 నుంచి సజావుగా సాగిన వీరి జీవితాలు ప్రస్తుత ప్రభుత్వం అధికారంలోకి రావడం, ప్రైవేటు మద్యం పాలసీకి పచ్చజెండా ఊపడంతో తారుమారైంది. కనీసం ఉద్యోగ భద్రత లేకుండా గుట్టుచప్పుడు కాకుండా తమను ప్రభుత్వం ఇంటికి పంపించడం అన్యాయమైన విషయమని వారు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. డిగ్రీలు, పీజీలు చేసి ఉద్యోగం ఉంటే చాలు అనే పని చేశామని ప్రస్తుతం ఆ ఉద్యోగాలు కూడా దూరమైపోతున్నాయన్నారు. తమిళనాడు రాష్ట్రంలా తమకు శాఖల్లో అవుట్ సోర్సింగ్, కాంట్రాక్టు పద్ధతిలో ఉద్యోగాలు ఇచ్చి భద్రత కల్పించాలని కోరుతున్నారు.

ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రశంసలు



బహుమతులు అందుకున్న విద్యార్థులతో నిర్వాహకులు

నగరి: చెకుముకి టాలెంట్ టెస్ట్ మండలస్థాయి పోటీల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు పాఠశాల ప్రధానోపాధ్యాయులు, టెస్ట్ నిర్వాహకులు ప్రశంసలు అందజేశారు. మంగళవారం 12 ఉన్నత పాఠశాలల నుంచి పాఠశాల స్థాయిలో ఎంపికైన విద్యార్థులకు ఎస్‌జీఎస్ జిల్లాపరిషత్ బాలికల ఉన్నత పాఠశాలలో మండల స్థాయి పోటీలు నిర్వహించారు. ఈ పోటీల్లో పుదుపేట, సత్రవాడ, చింతలపట్టెడ జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాలలు ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలను కైవసం చేసుకున్నాయి. ప్రతిభ చూపిన విద్యార్థులకు ప్రధానోపాధ్యాయులు పార్వతి, జనవిజ్ఞాన వేదిక కార్యదర్శి మునిరత్నం ప్రశంసించారు. పోటీలో పాల్గొన్న విద్యార్థులకు బహుమతులు అందజేశారు.

వక్తృత్వ పోటీల్లో అభినయ ప్రతిభ



పాలసముద్రం : జిల్లాలో స్వర్ణ ఆంధ్ర కార్యక్రమంలో జరిగిన వక్తృత్వ పోటీల్లో అభినయ విద్యార్థిని ద్వితీయ స్థానం సాధించారని మంగళవారం ఇన్‌చార్జ్ హెచ్‌ఎం మురుగదాస్ తెలిపారు. జిల్లాస్థాయిల్లో జరిగిన వక్తృత్వ పోటీల్లో తిరుమళరాజుపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల విద్యార్థిని అభినయ ద్వితీయ స్థానం సాధించినట్లు చెప్పారు. విద్యార్థి అభినయను ఉపాధ్యాయులు, గ్రామపెద్దలు అభినందించారు.

బాధ్యతల స్వీకరణ



ఎక్సైజ్ సీఐ శ్రీనివాసరెడ్డి

నగరి: ఎక్సైజ్ సీఐగా శ్రీనివాసరెడ్డి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో నగరి సీఐగా ఉన్న మాధవి బదిలీపై వెళ్లిపోవడంతో సత్యసాయి జిల్లా పెనుగొండ నుంచి నగరికి శ్రీనివాసరెడ్డి విచ్చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎక్సైజ్ పరిధిలో సారా బట్టీలు, సారా నిల్వలు, విక్రయాలపై తరచూ తనిఖీలు నిర్వహిస్తామన్నారు.

మానవ జీవితంలో సైన్స్ ఓ భాగం



విద్యార్థులకు మెడల్స్ అందిస్తున్న హెచ్‌ఎం భువనేశ్వరి

పుత్తూరు: మనిషి జీవితంలో సైన్స్ ఒక భాగమని, విద్యార్థులు శాస్త్రీయ దృక్పథంతో తమ ఆలోచనలకు పదును పెట్టాలని బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం భువనేశ్వరి సూచించారు. మంగళవారం జడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో చెకుముకి సైన్స్ సంబరాల్లో భాగంగా మండల స్థాయి టాలెంట్ టెస్ట్ నిర్వహించారు. ఒక్కో పాఠశాల నుంచి 10, 9, 8వ తరగతుల విద్యార్థులు బృందాలుగా పోటీల్లో పాల్గొన్నారు. పోటీ పరీక్షలో రాచపాళెం జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన విద్యార్థులు అమృత, కౌశిక, మోక్షిత ప్రథమ స్థానాన్ని కైవసం చేసుకున్నారు. ద్వితీయ స్థానాన్ని గొల్లపల్లి జడ్పీహెచ్‌ఎస్‌కు చెందిన సంపత్, మహాలక్ష్మీ, భారతి కైవసం చేసుకోగా, పుత్తూరు జడ్పీహెచ్‌ఎస్ గేల్స్‌కు చెందిన కీర్తి, దిషోజరెడ్డి, ఢిల్లీరాణిలు తృతీయ స్థానంలో నిలిచారు. నిర్వాహకులు విజేతలకు మెడల్స్, సర్టిఫికెట్లు అందజేశారు. కార్యక్రమంలో సైన్స్ ఉపాధ్యాయులు రమేష్, వేలు, సుధారాణి, షకిలా, సరేష్ తదితరులు పాల్గొన్నారు.

పాలసముద్రం సర్వేయరుగా గణేష్



పాలసముద్రం : మండల సర్వేయరుగా మంగళవారం గణేష్ బాధ్యతలు చేపట్టారు. ఆయన మాట్లాడుతూ గంగాధరనెల్లూరు మండలం నుంచి బదిలీపై పాలసముద్రం మండల సర్వేయరుగా వచ్చినట్లు చెప్పారు. రైతులకు అందుబాటులో ఉంటూ భూముల సమస్యలను పరిష్కరిస్తానని తెలిపారు.

ఆవలకొండ కరెంట్ ఏఈగా తనిగవేలు



గంగాధర నెల్లూరు: తూగుండ్రం పంచాయతీ ఆవలకొండ విద్యుత్ శాఖ ఏఈగా తనిగవేలు మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. ఈయన ఇంతకముందు బంగారుపాళ్యం మండల ఏఈగా పని చేస్తూ బదిలీపై వచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సబ్ స్టేషన్ పరిధిలో విద్యుత్ సమస్యలపై ఎలాంటి సమయంలో అయినా తనను సంప్రదించవచ్చన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే మా పయనం



మాట్లాడుతున్న ఎంపీపీ లత, బాలాజీ దంపతులు

కార్వేటినగరం: వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీతోనే తమ పయనమని ఎంపీపీ లత, జిల్లా ప్రధాన కార్యదర్శి బాలాజీ దంపతులు స్పష్టం చేశారు. మంగళవారం వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జనసేనలో చేరతామని వస్తున్న వదంతులను వారు తీవ్రంగా ఖండించారు. తమ కుటుంబంపై కొన్ని సామాజిక మాధ్యమాల్లో వేరే పార్టీలో చేరుతున్నట్లు దుష్ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. గతంలో తన తండ్రి శ్రీరాములునాయుడు కాంగ్రెస్ పార్టీ అభివృద్ధికి 40 ఏళ్లపాటు ఎనలేని సేవలు అందించారని, వైఎస్సార్ కాంగ్రెస్ ఆవిర్భావం అనంతరం మండల కన్వీనర్‌గా పని చేస్తూ మృతి చెందారన్నారు. తాము కూడా తన తండ్రి శ్రీరాములునాయుడు అడుగు జాడల్లో నడుస్తూ వైఎస్సార్‌సీపీలోనే ఉంటామని స్పష్టం చేశారు.

కార్యకర్త మృతికి నివాళి



నివాళులర్పిస్తున్న రామ్‌ప్రసాద్‌రెడ్డి

విజయపురం: మండలంలోని జగన్నాథపురం గ్రామం వైఎస్‌ఆర్‌సీపీ యువ నాయకుడు విశ్వనాథం తండ్రి రామచంద్ర యాదవ్ ఆకస్మికంగా మృతి చెందారు. మంగళవారం ఆయన భౌతిక కాయాన్ని సందర్శించిన మాజీ మంత్రి ఆర్కే రోజా సోదరుడు రామ్‌ప్రసాద్‌రెడ్డి పూలమాల వేసి నివాళులర్పించారు. కుటుంబ సభ్యులను ఓదార్చారు. ఈ కార్యక్రమంలో వైఎస్‌ఆర్ సీపీ నాయకులు పాల్గొన్నారు.

మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలి



విద్యార్థులకు బహుమతులు అందిస్తున్న హెచ్‌ఎం గాయత్రీదేవి

కార్వేటినగరం: ప్రజలు మూఢ నమ్మకాలకు దూరంగా ఉండాలని జిల్లా పరిషత్ బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం గాయత్రీదేవీ అన్నారు. మంగళవారం బాలికల ఉన్నత పాఠశాలలో జనవిజ్ఞాన వేదిక మండల స్థాయి టాలెంట్ టెస్టు నిర్వహించారు. కన్వీనర్ వేణుగోపాల్ ఆధ్వర్యంలో విద్యార్థులకు చెకుముకి పోటీలు నిర్వహించారు. మండల స్థాయిలో నిర్వహించిన పోటీ పరీక్షల్లో ప్రభుత్వ పాఠశాల నుంచి పాల్గొన్న విద్యార్థులు మొదటి స్థానం, కత్తెరపల్లి ఉన్నత పాఠశాల విద్యార్థులు ద్వితీయ స్థానం, కేఎంపురం ఉన్నత పాఠశాల విద్యార్థులు తృతీయ స్థానం, ఆర్‌కేఎస్‌ఆర్ ప్రభుత్వ పాఠశాల విద్యార్థులు నాలుగో స్థానంలో నిలిచారు. శ్రీలక్ష్మీ నరసింహ ప్రైవేటు ఉన్నత పాఠశాల విద్యార్థులు, శ్రీస్వామి వివేకానంద పాఠశాల, కత్తెరపల్లి వారు కూడా విజేతలుగా నిలిచారు. వీరికి బాలికల ఉన్నత పాఠశాల హెచ్‌ఎం చేతుల మీదుగా బహుమతులను అందించారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యాయులు వెంకటేష్, శేఖర్, రమణ, సుబ్రమణ్యం, విజయలక్ష్మీ, భారతి, వరలక్ష్మీ, రెడ్డెమ్మ, బంగారమ్మ, లీనాకుమారి పాల్గొన్నారు.

భూసార పరీక్షలతో పంటకు రక్ష



మాట్లాడుతున్న వ్యవసాయ అధికారి ఢిల్లీప్రసాద్

పాలసముద్రం: భూసారం తెలుసుకోవడానికి మట్టి పరీక్ష చేయడం తప్పనిసరని మండల వ్యవసాయాధికారి ఢిల్లీప్రసాద్ తెలిపారు. మంగళవారం శ్రీకావేరిరాజుపురం రైతు భరోసా కేంద్రంలో పొలంబడి కార్యక్రమం నిర్వహించారు. రైతులతో ఏఓ ఢిల్లీప్రసాద్ మాట్లాడుతూ భూసారం తెలుసుకోవడానికి మట్టి పరీక్షలు చేయాలని సూచించారు. పంట కోతలు ముగిసిన నెల రోజులకు మట్టి నమూనా సేకరించాలని తెలిపారు. భూసార పరీక్షల ఆధారంగా పంటలు సాగు చేస్తే అధిక దిగుబడులు వస్తాయన్నారు. ప్రభుత్వం భూసార పరీక్షలు చేసి రైతులకు కార్డులు అందించే కార్యక్రమం చేపట్టిందన్నారు. రసాయన ఎరువులు అధికంగా వాడితే భూమిలో సారం తగ్గి పంట దిగుబడి తగ్గిపోతుందన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ మహేష్, పశువైద్యాధికారి యశశ్వి, ఆర్‌బీకే సహాయకురాలు వనజ, రైతులు పాల్గొన్నారు.

వాగ్గేయకార శిరోమణి సారంగపాణి



సంగీతాన్ని ఆలపిస్తున్న పండితులు



సంగీత గేయధార సమావేశానికి హాజరైన వక్తలు

కార్వేటినగరం: వాగ్గేయకార శిరోమణి.. శ్రీవేణుగోపాలస్వామిని ఆరాధించిన పరమ భక్తుడు సారంగపాణి అని, సంగీత సాహితీ చంద్ర అవార్డు గ్రహీత సాయికృష్ణ యాచేంద్ర అన్నారు. మంగళవారం జిల్లా విద్యాశిక్షణా సంస్థ (డైట్) ఆడిటోరియంలో సంగీత సాహిత్య గేయధార భూమన్‌తో పాటు పలువురు ప్రముఖ రచయితలతో నిర్వహించిన సారంగపాణి పదపరిచయ కార్యక్రమంలో సాయికృష్ణ యాచేంద్ర మాట్లాడుతూ ఎందరో వాగ్గేయకారులకు సారంగపాణి ఆదర్శనీయమని కొనియాడారు. అదే విధంగా సంగీత సాహితీ రత్న బిరుదాంకితులు వెంకటేశ్వర భక్తి చానల్ తిరుపతి పూర్వ అధ్యక్షుడు వెలుగోటి వంశోద్ధారకుడు డాక్టర్ భాస్కర్ సాయికృష్ణ యాచేంద్ర, సంగీత సాహిత్య గేయధారను నడిపించారు. కార్యక్రమంలో ముఖ్య అతిథిగా పాల్గొన్న చెన్నై ఐకాన్ టెక్నాలజీస్ ప్రైవేట్ లిమిటెడ్ సాఫ్ట్‌వేర్ సంస్థ వ్యవస్థాపక డైరెక్టర్ సంగీత సాహిత్య తెలుగు భాషాభిమాని శోభరాజు నిర్వహించగా, శతావధాన చక్రవర్తి రచయిత, వక్త, ఆధ్యాత్మిక వేత్త, వ్యక్తిత్వ వికాస నిపుణులు కోఆర్డినేటర్, సారంగపాణి ప్రాజెక్టు డాక్టర్ ఆముదాల మురళీ సంచాలకులుగా వ్యవహరించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయం పూర్వ వైస్ చాన్సలర్ ఆచార్య పి.కుసుమకుమారి, యువ ప్రవచనకర్త ఆదిత్యశర్మ, శోభారాజు పలువురు పృచ్ఛకులుగా వ్యవహరించారు. అదేవిధంగా హంస ధ్వనిబాబు రాగ, తాళ నిర్దేశం చేశారు. కార్యక్రమం చివరిలో కర్ణాటక సంగీత గాత్ర కళాకారుడు డాక్టర్ టి.లీలామనోహర్‌రెడ్డి సారంగపాణి రచించిన కృతులను వినిపించి ప్రేక్షకులను ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగుల సంఘం అధ్యక్షుడు బి.భాస్కర్‌రాజు, గ్లోబల్ క్షత్రియ సేవా సంఘం అధ్యక్షుడు శంకర్‌రాజు, కార్వేటినగరం సర్పంచ్ ధనుంజయ వర్మ, పురుషోత్తంరాజు, పూర్వవిద్యార్థుల సంఘం సభ్యులు విజయకుమార్ పిళ్లై, డైట్ అధ్యాపకులు అతిథులుగా విచ్చేసిన వారిని ఘనంగా సన్మానించారు.